# పత్రికా రంగం

**భారత దేశంలో వార్తా పత్రికలు ప్రచురితం కావడం మొదటగా 18వ శతాబ్దంలో ప్రారంభమయ్యింది. కోల్‌కతా నుంచి ప్రచురితమైన 'బెంగాల్ గెజిట్' (కలకత్తా జనరల్ అడ్వటైజర్) ఆంగ్ల పత్రిక దేశంలో మొదటి వార్తాపత్రిక. ఈ పత్రికను ఆగస్టస్ హికీ 1780, జనవరి 29న ప్రచురించారు. దీని తర్వాత 'ద ఇండియా గెజిట్', 'ద మద్రాస్ కొరియన్', 'ద బోంబే హెరాల్డ్' వంటి పత్రికల ప్రచురణ ప్రారంభమయ్యింది. ఈ పత్రికల్లో ప్రధానంగా బ్రిటిష్ పాలనలో ఉన్న ప్రాంతాలకు సంబంధించిన సమాచారం ఉండేది. 1822లో గుజరాత్‌లో ప్రారంభమైన 'బాంబే సమాచార్' ఆసియాలో ఇప్పటికి ప్రచురితమవుతున్న పురాతన పత్రిక**

ఆ తర్వాత 'టైమ్స్ ఆఫ్ ఇండియా'ను 1838లో 'ద బోంబే టైమ్స్ అండ్ జర్నల్ ఆఫ్ కామర్స్' పేరున బెన్నట్, కాల్మెన్ అండ్ కంపెనీ ముంబై నుంచి ప్రచురించింది. తర్వాత 1961లో టైమ్స్ గ్రూపు 'ఎకనమిక్ టైమ్స్', 'నవభారత్ టైమ్స్'(హిందీ), 'మరాఠీ టైమ్స్' (మరాఠీ) పత్రికలను ప్రారంభించింది.

బెంగాల్ నుంచి బెంగాలీ భాషలో ప్రచురితమైన 'సమాచార్ దర్పణ్' భారతీయ భాషల్లో ప్రచురితమైన మొదటి వార్తా పత్రిక. దీని తర్వాతే బెంగాల్ గెజిట్, ముంబై నుంచి 'బోంబే సమాచార్' వచ్చాయి. మొదటి హిందీ వార్తా పత్రిక 'సమాచార్ సుధా వర్షణ్' 1854లో ప్రారంభమై సర్క్యులేషన్‌లో ప్రభంజనం సృష్టించింది. ఈ పత్రికకు లభించిన అపూర్వ ఆదరణ ప్రేరణతో వివిధ భాషల్లో అనేక వార్తా పత్రికలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం భారత దేశ సమాచార వ్యవస్థలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు ప్రభావవంతమైన పాత్రను పోషిస్తున్నాయి. ప్రస్తుతం (2011 డిసెంబర్ 29 నాటికి) దేశంలో రిజిస్టర్ అయిన వార్తాపత్రికలు/పీరియాడికల్స్ సంఖ్య 82,237. వీటిలో అత్యధికంగా హిందీలో 7910 వార్తా పత్రికలు ప్రచురితమవుతున్నాయి. ఒక్క 2010-11లోనే 4853 పత్రికలు నమోదయ్యాయి.

## రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్

రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా (ఆర్ఎన్ఐ) 1956 జులై 1న ఏర్పాటు చేశారు. 1953లో ఏర్పడిన మొదటి ప్రెస్ కమిషన్ సిఫార్సు మేరకు ఆర్ఎన్ఐ రూపుదిద్దుకుంది. ఆర్ఎన్ఐను ప్రెస్ రిజిస్ట్రార్ అని కూడా అంటారు. ఆర్ఎన్ఐ ఏటా డిసెంబర్ 31లోపు దేశంలోని అన్ని వార్తా పత్రికల పూర్తి సమాచారం నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందించాలి.

### ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని అందించే కీలక విభాగమే 'ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో' (పీఐబీ). ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు, లక్ష్యాలు, విజయాలను ఎప్పటికప్పుడు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలకు పీఐబీ పత్రికా ప్రకటనలు, ఫీచర్ ఆర్టికల్స్, బ్యాక్ గ్రౌండర్స్, ప్రెస్ బ్రీఫింగ్స్, ఫోటోగ్రాఫ్స్, పత్రికా సమావేశాలు, ఇంటర్వ్యూలు, ప్రెస్ టూర్లు, బ్యూరో వెబ్‌సైట్‌లో డేటాబేస్‌ల ద్వారా అందిస్తుంది. అన్నిమంత్రిత్వ శాఖలకు సంబంధించిన ప్రెస్ రిలీజ్‌లను విడుదల చేస్తుంది.

## న్యూస్ ఏజెన్సీలు

**ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పీటీఐ):** .దేశంలోని అతి పెద్ద న్యూస్ ఏజెన్సీ అయిన పీటీఐను 1947 ఆగస్ట్ 27న ఏర్పాటు చేశారు. 1949 ఫిబ్రవరి 1 నుంచి పీటీఐ పని చేయడం ప్రారంభించింది. దేశంలోని వార్తా పత్రికలన్నీ కలిసి సమాచారాన్ని పంచుకోవడానికి లాభాపేక్షలేని సహకార సంస్థగా పీటీఐని నెలకొల్పారు. ఇందులో సభ్యులైనవారందరికీ నిష్పాక్షికమైన వార్తలను సకాలంలో అందించాలన్న నిబంధనతో పీటీఐ పనిచేస్తుంది. ఇంగ్లిష్, హిందీ భాషల్లో పీటీఐ వార్తలను అందిస్తుంది. పీటీఐ తరపున హిందీ భాషా సమాచారాన్ని అందించే ఏజెన్సీని 'భాష' అంటారు. 500 పైగా వార్తా పత్రికలు అలాగే ఎన్నో విదేశీ పత్రికలు పీటీఐ చందాదారులుగా ఉన్నారు. దేశ, విదేశాల్లోని అన్ని ప్రధాన టీవీ/రేడియో ఛానళ్లకు పీటీఐ సమాచారాన్ని అందిస్తోంది. న్యూస్, ఫోటో సర్వీసులతో పాటు పీటీఐ ఫీచర్స్‌కు సంబంధించి మెయిలర్ ప్యాకేజీలు, సైన్స్ సర్వీస్, ఎకనమిక్ సర్వీస్, డేటా ఇండియా, స్క్రీన్ ఆధారిత (న్యూస్ స్కాన్, స్టాక్స్ స్కాన్)సర్వీసులు అందిస్తుంది. ఇవి కాక పీటీఐ–టీవీ విభాగం ఫీచర్లను, కార్పొరేట్ డాక్యుమెంటరీలను కూడా ఒప్పంద మేరకు చేసి పెడుతుంది.

### యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యూఎన్ఐ)

1956 కంపెనీల చట్టం ప్రకారం యుఎన్ఐ వార్తా సంస్థను 1959 డిసెంబర్ 19న ఏర్పాటు చేశారు. ఇది 1961 మార్చి 21 నుంచి పని చేయడం ప్రారంభించింది. ప్రారంభం నుంచి ఎంతో చురుకుగా పనిచేస్తున్న యుఎన్ఐ దేశంలో పూర్తి స్థాయి హిందీ వైర్ సర్వీసు 'యూఎన్ఐవార్త'ను ప్రారంభించిన మొదటి న్యూస్ ఏజెన్సీగా గుర్తింపు పొందింది. అదే దశకంలో ఫోటో సర్వీసు, గ్రాఫిక్ సర్వీసులను కూడా ప్రారంభించింది. తర్వాత 1990 దశకంలో ఉర్దూలో కూడా వైర్ సర్వీసును యుఎన్ఐనే మొదట ప్రారంభించింది.

### ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా

పత్రికా స్వాతంత్ర్యాన్ని పరిరక్షించి, వార్తా పత్రికలు, వార్తా సంస్థల పనితీరు, ప్రమాణాలను మెరుగుపరచే లక్ష్యంతో పార్లమెంటు చట్టం మేరకు 'ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' ఏర్పాటయ్యింది.

సాధారణంగా ప్రెస్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిని నియమించడం సంప్రదాయంగా వస్తోంది. కౌన్సిల్‌లో మొత్తం 28 మంది సభ్యులు ఉంటారు. ఇందులో 20 మంది పత్రికా రంగం నుంచి ఉంటారు. మరో ఐదుగురు పార్లమెంటు సభ్యులు (ఇందులో ముగ్గుర్ని లోక్‌సభ స్పీకర్, ఇద్దర్ని రాజ్యసభ చైర్మన్ నామినేట్ చేస్తారు). మిగిలిన ముగ్గుర్ని సాహిత్య అకాడెమీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌లు ఒక్కొక్కరి చొప్పున నియమిస్తాయి.

## ప్రసార్ భారతి

భారత దేశ అతి పెద్ద సమాచార ప్రసార (బ్రాడ్ కాస్టింగ్) సంస్థ 'ప్రసార భారతి' పూర్తి స్వయం ప్రతిపత్తితో నడిచే సంస్థ. ఇంత కాలం కేంద్ర సమాచార ప్రసారం కోసం విదేశాల్లో మాదిరిగా ప్రభుత్వ జోక్యం లేని పూర్తి స్వయం ప్రతిపత్తితో నడిచే ప్రసార సంస్థ కావాలన్న డిమాండుకు అనుగుణంగా పార్లమెంటు 1990లో ఒక చట్టాన్ని ఆమోదించింది. అయితే ఇది 1997 సెప్టెంబర్ 15కు గాని చట్ట రూపం దాల్చలేదు. 1997 నవంబర్ 23 నుంచి ప్రసారభారతి పనిచేయడం ప్రారంభించింది. ప్రసార శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న దూరదర్శన్ టెలివిజన్, ఆల్ ఇండియా రేడియో (ఆకాశవాణి) సంస్థలు ప్రసారభారతి కిందకు వచ్చాయి.

## రేడియో బ్రాడ్ కాస్టింగ్

భారత దేశంలో రేడియో ప్రసారాలు 1920 దశకం ప్రథమార్థంలో ప్రారంభమయ్యాయి. మొదటి రేడియో కార్యక్రమాన్ని 1923లో రేడియో క్లబ్ ఆఫ్ బోంబే ప్రసారం చేసింది. తర్వాత 1927లో ముంబై, కోల్‌కతాలలో రేడియో సర్వీసులను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ప్రభుత్వం ఈ ట్రాన్స్‌మీటర్లను తమ ఆధీనంలోకి తీసుకొని 'ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్' పేరిట ప్రసారాలను ప్రారంభించింది. 1936లో దీన్ని ఆల్ ఇండియా రేడియోగా మార్చారు.

ప్రస్తుతం ఆల్ ఇండియా రేడియో ప్రపంచంలోనే అతి పెద్ద రేడియో బ్రాడ్‌కాస్టింగ్ వ్యవస్థలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. స్వాతంత్ర్యానంతరం దేశంలో 6 రేడియో స్టేషన్లు 18 ట్రాన్స్‌మిటింగ్ కేంద్రాలు మాత్రమే ఉండేవి. వీటి ప్రసారాలు దేశంలోని 11 శాతం ప్రజలకు, 2.5 శాతం ప్రాంతాలకు మాత్రమే చేరేవి. ప్రస్తుతం (డిసెంబర్ 2009 నాటికి) దేశంలో 375 ట్రాన్స్‌మిటర్స్‌తో 233 రేడియోస్టేషన్లు పనిచేస్తున్నాయి. వీటి ప్రసారాలు 99.16 శాతం ప్రజలకు, 91.82 శాతం ప్రాంతాలకు అందుతున్నాయి.

ఎఫ్‌ఎం రేడియో బ్రాడ్ కాస్టింగ్ సర్వీసుల్లోకి ప్రైవేటు సంస్థలను అనుమతిస్తూ 1999లో ప్రభుత్వం ఫేజ్-1 విధానం ప్రకటించింది. ఎఫ్.ఎం. వ్యాపారానికి ఈ విధానం అంత అనుకూలంగా లేకపోవడంతో ప్రైవేటు సంస్థలు అంతగా స్పందించలేదు. తర్వాత ఈ విధానాన్ని సంస్కరిస్తూ డాక్టర్ అమిత్ మిత్రా కమిటీ, ట్రాయ్‌లు చేసిన సిఫార్సుల మేరకు 2005లో ప్రభుత్వం ఫేజ్-2 ప్రైవేటీకరణ

సంస్కరణలను ప్రకటించింది. వీటికి అన్ని వర్గాల నుంచి ఆమోదం లభించింది. ఫేజ్-2 తర్వాత 338 ఫ్రీక్వెన్సీలను ఆఫర్ చేయగా 237 అమ్ముడు పోయాయి.

## టెలివిజన్

భారత దేశంలో టెలివిజన్ ప్రసారాలు 1959 సెప్టెంబర్ 15న ఢిల్లీలోని ఆకాశవాణి భవన్‌లో ప్రారంభించారు. 500 వాట్ల ట్రాన్స్‌మిటర్‌తో కేవలం 25 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే ఈ ప్రసారాలు అందజేశారు. అయితే న్యూస్ బులిటెన్‌లతో కూడిన నిరంతర ప్రసారాలు మాత్రం 1965 నుంచి ప్రారంభమయ్యాయి. తర్వాత ఏడు సంవత్సరాలకు ముంబాయిలో రెండో టెలివిజన్ కేంద్రం పనిచేయడం ప్రారంభించింది. 1975 నాటికి కోల్‌కతా, చెన్నై, శ్రీనగర్, అమృతసర్, లక్నో నగరాలకు టివి ప్రసారాలు అందాయి. 1982లో న్యూఢిల్లీలో ఆసియా క్రీడల సందర్భంగా కలర్ టెలివిజన్ ప్రసారాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం (2010 నాటికి) దేశంలో 500 టీవీ శాటిలైట్ టెలివిజన్ ఛానల్స్ ప్రసారాలు అందిస్తున్నాయి.

## పార్లమెంటు ఛానల్స్

పార్లమెంటు ఉభయ సభల (రాజ్యసభ, లోక్‌సభ) కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేయడానికి ప్రత్యేకంగా రెండు శాటిలైట్ చానల్స్ పనిచేస్తున్నాయి. 2004 డిసెంబర్ 14 నుంచి ఈ ఛానళ్లు దూరదర్శన్ ద్వారా పార్లమెంటు కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం ప్రారంభించాయి.